www.prajasakti.com

ప్రజాశక్తి

సోమవారం 21 ఆగస్టు 2023

ఓటర్ల సర్వే వేగవంతం : ఆర్‌డిఒ

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

ఓటరు జాబితా సవరణలో భాగంగా చేపట్టిన ఇంటింటి సర్వే త్వరితగతిన పూర్తిచేయాలని ఆర్‌డిఒ ఎం.ఝాన్సీ రాణి తెలిపారు. మండలంలోని దర్భగూడెం పంచాయతీలో జరుగుతున్న ఓటరు సవరణ జాబితా ఇంటింటి సర్వేను క్షేత్రస్థాయిలో ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సర్వేకు వెళ్లిన సందర్భంలో తప్పనిసరిగా బిఎల్ఒలు, బిఎల్ఎలను వెంటబెట్టుకుని వెళ్లాలని సూచించారు. ఓటరు జాబితాలో ఏమైనా మార్పులు, చేర్పులు ఉంటే వాటిని సరిదిద్ది లోపాలను సరి చూసుకోవాలని సూచించారు. జనన, మరణ రిజిస్టర్ల ప్రకారం మరణించిన ఓట్లను తొలగించాలని తెలిపారు. అర్హులైన ఏ ఒక్క ఓటరుని తొలగించరాదని సిబ్బందిని ఆదేశించారు. అదే విధంగా 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరినీ ఓటరుగా నమోదు చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఆమెవెంట విఆర్ఒ పాషా, బిఎల్ఒ సువర్ణ ఉన్నారు.

సమస్యల సుడిలో సంక్షేమ హాస్టళ్లు

ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కె.లెనిన్ - ముగిసిన రెండు రోజుల సైకిల్ యాత్ర

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఏలూరు నగరంలోని వసతి గృహాలు సమస్యల వలయంలో చిక్కుకున్నాయని, విద్యార్థులు నరకయాతన అనుభవిస్తున్నారని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కె.లెనిన్ అన్నారు. విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో చేపట్టిన రెండు రోజుల సైకిల్ యాత్ర ఆదివారంతో ముగిసింది. ఈ యాత్రలో భాగంగా ఎస్ఎఫ్ఐ నాయకులు ఏలూరు పట్టణంలో ఉన్న అన్ని హాస్టళ్లకు వెళ్లి విద్యార్థుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కె.లెనిన్ మాట్లాడుతూ హాస్టళ్లలో విద్యార్థులకు దోమతెరలు కూడా లేకపోవడం వల్ల విద్యార్థులు రాత్రి నిద్రలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జిఒ నెం.77 వల్ల పేదవిద్యార్థులు పీజీ వంటి ఉన్నత విద్యకు దూరమయ్యారని, ఈ ఇఒ ప్రకారం ప్రయివేటు కళాశాలల్లో చదివేవారికి ఉపకారవేతనాలు నిలిపివేస్తామని, ప్రభుత్వ కళాశాలల్లో చదువుకుందామంటే జిల్లాలో ప్రభుత్వ పీజీ కళాశాలలు లేవన్నారు. జిల్లావ్యాప్తంగా సుమారు 20 వేల మంది ఇంజినీరింగ్ చదువుతున్నారని, వీరంతా ప్రయివేటురంగంలోనే విద్యను అభ్యసిస్తున్నారని, జిల్లాలో ప్రభుత్వ ఇంజినీరింగ్, ఫార్మసి కళాశాలలు లేవని, అలాగే పట్టణంలోని నర్సింగ్ కాలేజీకి సొంత భవనం లేదని, రెండేళ్ల నుంచి నర్సింగ్ కాలేజీ పనులు జరుగుతూనే ఉన్నాయని తెలిపారు. జిల్లాలో టెక్నికల్ విద్యలో ప్రభుత్వమే కళాశాలలు ఏర్పాటు చేయాలని కోరారు. సంక్షేమ హాస్టళ్లలో మెస్ ఛార్జీలు ఈ ప్రభుత్వం వచ్చిన తర్వాత పెంచలేదని, ప్రస్తుతం ఇస్తున్న బిల్లులకు మార్కెట్లో ఉన్న ధరలకు చాలా వ్యత్యాసం ఉంటుందని, ఫలితంగా హాస్టల్ విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించడం లేదని, తగినంత సిబ్బందిని, వర్కర్లను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కోటదిబ్బ ఇంటర్ కళాశాల ఆవరణలో, డిగ్రీ కాలేజీ కూడా ఉందని, ఈ కళాశాల ఏర్పాటుకు ఎస్ఎఫ్ఐ అనేక పోరాటాలు చేసిందని, అప్పటిలో సమస్యను తాత్కాలిక పరిష్కారం కోసం ప్రభుత్వ జూనియర్ కాలేజీలో షిఫ్ట్‌ల ప్రకారం నిర్వహించారని, ప్రస్తుతం ఇంటర్‌కు 30 గదులు, డిగ్రీకి 20 గదులు కావాల్సి ఉన్నా కాలేజీలో మొత్తం 30 గదులే ఉన్నాయన్నారు. అదనపు గదులు ఏర్పాటు చేయాలని, డిగ్రీ కాలేజీకి స్థలం కేటాయించి సొంత భవనాలు నిర్మించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నగర కార్యదర్శి ఎల్.రాజేష్, ఎస్ఎఫ్ఐ నాయకులు హరి, చందు, రాజేష్ పాల్గొన్నారు.

విద్యార్థుల సమస్యలు తెలుసుకుంటున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

23న ఏలూరుకు సిపిఐ బస్సుయాత్ర

పోలవరం నిర్వాసితుల సమస్యలపై అఖిలపక్షాలతో రౌండ్ టేబుల్ సమావేశం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ విశాఖలో ప్రారంభమైన సిపిఐ బస్సుయాత్ర ఈనెల 23న ఏలూరు చేరుకుంటున్న నేపథ్యంలో యాత్రను విజయవంతం చేయాలని సిపిఐ ఏలూరు ఏరియా సమితి కార్యదర్శి ఉప్పులూరి హేమశంకర్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా సిపిఐ ఏలూరు ఏరియా తంగెళ్లమూడి శాఖ సమావేశం ఆదివారం సాయంత్రం పార్టీ నేత హకీమ్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో హేమశంకర్ మాట్లాడుతూ ఈ బస్సుయాత్ర ఈనెల 17వ తేదీన విశాఖపట్నంలోని స్టీల్ ఫ్యాక్టరీ వద్ద ప్రారంభమైందన్నారు. 23వ తేదీ ఉదయం 10 గంటలకు ఏలూరు ఆశ్రం ఆసుపత్రి వద్దకు చేరుకుంటుందని, అక్కడి నుండి ర్యాలీగా అల్లూరి సీతారామరాజు స్టేడియం వద్దగల టుబాకో మర్చంట్స్ కళ్యాణ మండపానికి చేరుకుంటుందని తెలిపారు. అక్కడ 'పోలవరం ప్రాజెక్టు సత్వర నిర్మాణం-నిర్వాసితుల సమస్యల పరిష్కారం' అంశంపై అఖిలపక్ష పార్టీలతో రౌండ్ టేబుల్ సమావేశం జరుగుతుందని తెలిపారు.



చెక్కును అందిస్తున్న ఎంఎల్ఎ

కిడ్నీ వ్యాధిగ్రస్తునికి రూ.10 లక్షల సిఎం రిలీఫ్ ఫండ్

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

ఆర్థిక ఇబ్బందుల కారణంగా కిడ్నీ మార్పిడి శస్త్ర చికిత్స చేయించుకోలేక ఇబ్బంది పడుతున్న పెదవేగి మండలం విజయరాయి గ్రామానికి చెందిన గురజ కనకదుర్గారావుకు రూ.పది లక్షల సిఎం రిలీఫ్ ఫండ్ మంజూరైంది. ఇటీవల దెందులూరు ఎంఎల్ఎ కొఠారు అబ్బయ్యచౌదరిని మర్యాదపూర్వకంగా కలిసి, సాయం చేయాలని బాధితుడు కోరారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ఎంఎల్ఎ గుంటూరు జిల్లా తాడేపల్లిలోని మణిపాల్ ఆసుపత్రిలో కనకదుర్గారావుకు శస్త్ర చికిత్స, వైద్య ఖర్చుల కోసం సిఎం రిలీఫ్ ఫండ్ రూ.10 లక్షలు మంజూరు చేయించారు. ఆ చెక్కును పెదవేగి మండలం కొండలరావుపాలెంలోని ఎంఎల్ఎ క్యాంపు కార్యాలయంలో వారి కుటుంబ సభ్యులకు ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎకి కుటుంబ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కొఠారు రామచంద్రరావు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజల్లో చైతన్యం తీసుకురావడమే లక్ష్యం

ప్రజాశక్తి - మండవల్లి

ప్రజలు తమ సమస్యలు తామే పరిష్కరించుకునేలా వారిలో చైతన్యం తీసుకురావడమే, మెరుగైన సమాజ స్థాపనే ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక కృషి చేస్తుందని ఐక్యవేదిక జిల్లా కన్వీనర్ ఎల్ఎస్.భాస్కరరావు అన్నారు. స్థానిక స్టేషన్ రోడ్డు సెంటర్‌లోని టైప్ ఇన్‌స్టిట్యూట్‌లో వేదిక మండల సర్వసభ్య సమావేశం ఆదివారం జరిగింది. మండల అధ్యక్షులు బి.అప్పారావు అధ్యక్షత వహించిన ఈ సమావేశంలో భాస్కరరావు మాట్లాడుతూ 'సేవ' దృక్పథం కలిగి, వేదికకు సమయం కేటాయించగలిగే వ్యక్తులను ఐక్యవేదికలోకి తీసుకుంటామన్నారు. మంచి వాక్చాతుర్యం, ప్రజల్లో చైతన్యం తీసుకురావడం, గ్రామసభలు, సమాచార హక్కు చట్టం, రాజ్యాంగం వంటి అంశాలపైన సభ్యులు అవగాహన కలిగివుండాలన్నారు. ప్రతినెల రెండో ఆదివారం సభ్యులందరూ సమావేశమై వేదిక బలోపేతానికి తీసుకోవాల్సిన అంశాలపై చర్చిస్తామన్నారు. అనంతరం ఐక్యవేదిక బాధ్యులకు ప్రాథమిక సభ్యత్వకార్డులను అందించారు. ఈ కార్యక్రమంలో వేదిక ప్రధాన కార్యదర్శి పొన్నూరు రామచంద్రరావు, బండి దివాకర్, గణేష్, బుద్దుల రాముడు, బి.శివయ్య, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.



సత్కరిస్తున్న నాయకులు

డిప్యూటీ కలెక్టర్ సంగీత్‌మాధుర్‌కు సత్కారం

ప్రజాశక్తి - ఏలూరు

డిప్యూటీ కలెక్టర్‌గా నియమితులైన కానాల సంగీత్‌మాధుర్‌ను కాపు సంక్షేమసేన ఆధ్వర్యంలో ఆదివారం ఏలూరులో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా జరిగిన సభకు అధ్యక్షత వహించిన జిల్లా అధ్యక్షులు పులి శ్రీరాములు మాట్లాడుతూ పరీక్షలు రాసిన 86 వేల మందిలో కేవలం 13 మంది డిప్యూటీ కలెక్టర్లలో మాధుర్ ఒకరన్నారు. ప్రతిభావంతులైన వారిని ప్రోత్సాహిస్తున్న తాము ప్రతిభా పురస్కారాన్ని, రజిత పతకాన్ని అందిస్తున్నట్లు తెలిపారు. మాధుర్‌ను సత్కరించిన వారిలో సంక్షేమ సేన ఏలూరు అసెంబ్లీ నియోజకవర్గ అధ్యక్షులు వాసారాజు, ప్రముఖ వాణిజ్యవేత్తలు నారా శేషు, యాళ్లబండి శ్రీరామ్, చెరకుతోట రాము, కాపు సంక్షేమసేన నాయకులు తన్నీరు బుజ్జి, యడ్లపల్లి ప్రసాద్, గాది రాంబాబు, బర్మా లక్ష్మణరావు, కొప్పిశెట్టి వేణుగోపాల్, ఉప్పు లంకేష్, విఠాల శేషగిరి, లింగిశెట్టి శశి కుమార్, బాడిత నారాయణరావు, బొండా రామునాయుడు, కె.మురళీకృష్ణ, పేటేటి రామకృష్ణ ప్రసాద్, తోట వరప్రసాద్, వి.రమేష్, సోడిశెట్టి శాంతకుమార్, గొడవర్తి నవీన్ కుమార్ ఉన్నారు.

రోడ్లపైనే నిర్మాణ సామగ్రి

వాహనదారులకు తప్పని అవస్థలు - పట్టించుకోని పంచాయతీ అధికారులు

ప్రజాశక్తి - ముదినేపల్లి

రోడ్డుపై వేసిన నిర్మాణ సామగ్రి

మండలకేంద్రమైన ముదినేపల్లిలోని ప్రధాన రహదారులపైనే ప్రయివేటు అపార్టుమెంట్ల నిర్మాణదారులు తమ సామగ్రిని నిల్వ చేస్తున్నారు. నెలలు తరబడి రోడ్ల మార్జిన్లల్లో కంకర, ఇసుక, బుసుక, ఐరన్ తదితర వస్తు సామగ్రిని రోడ్లపైనే నిల్వచేస్తున్నారు. దీంతో రాత్రి సమయాల్లో వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అడ్డగోలుగా అర్‌అండ్‌బి రోడ్లను అక్రమించి నిర్మాణ సామగ్రిని నిల్వచేయడంతో ప్రజలు, వాహనచోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. అసలే రోడ్లన్నీ భారీ గుంతలతో ప్రమాదకరంగా మారాయి. వర్షం కురిస్తే గుంతల్లో చేరి రోడ్డు కనబడక వాహనదారుల తీవ్రఅవస్థలు పడడంతో పాటు ప్రమాదాలబారిన పడి క్షతగాత్రులవుతున్నారు. రోడ్లతోనే నకరం అనుభవిస్తూంటే ఇదీ చాలదా అన్నట్లు రహదారుల వెంబడి ఇష్టారాజ్యంగా ఇసుక, ఇతర నిర్మాణ సామగ్రిని నిల్వచేయడంతో వాహనదారులు పడరాని పాట్లు పడుతున్నారు. ముదినేపల్లిలోని గురజ రోడ్డులో భారత్ గ్యాస్ కార్యాలయం వద్ద, బంటుమిల్లి రోడ్డులోని రాముగారి షెడ్డు వద్ద రోడ్డుపై కంకర, బుసుక, ఐరన్ నిల్వ చేశారు. ఈ నిర్మాణాలు నెలల తరబడి జరుగుతుండటంతో సామగ్రి కూడా రోడ్డుపైనే అప్పటి వరకూ నిల్వ ఉంటుంది. దీంతో రాత్రి సమయాల్లోనే కాకుండా, పగటి వేళల్లో కూడా ప్రమాదాలు జరుగుతున్నాయి. ఎదురుగా భారీ వాహనాలు వస్తే ప్రయాణించడం కష్టంగా మారుతుంది. పంచాయతీ అధికారులు స్పందించి ప్రమాదాలకు నిలయాలుగా మారిన రోడ్లపై నిల్వచేసిన కంకర, ఇసుక తదితర వస్తుసామగ్రిని తొలగించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు, వాహనచోదకులు ముక్తకంఠంతో కోరుతున్నారు.

రోడ్డు మార్జిన్‌లో వేసిన కంకర

జిల్లావ్యాప్తంగా రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

ప్రజాశక్తి - ఏలూరు

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చట్టపరంగా కఠినచర్యలు తీసుకుంటామని జిల్లాలోని వివిధ పోలీసు స్టేషన్ల అధికారులు రౌడీషీటర్లను హెచ్చరించారు. జిల్లా ఎస్‌పి మేరీ ప్రశాంతి ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్లలో రౌడీషీటర్లకు ఆదివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా కైకలూరు, జంగారెడ్డిగూడెం, పోలవరం, కైకలూరు, చింతలపూడి, తదితర తదితర సర్కిళ్ల పరిధిలో రౌడీషీటర్లకు కౌన్సిలింగ్ నిర్వహించారు. రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు. అసాంఘిక కార్యక్రమాలకు, అల్లర్లకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు. కష్టపడి పనిచేసుకుని కుటుంబాలను పోషించుకోవాలని పిల్లలను చదివించి ప్రయోజికులను చేయాలన్నారు. హింసామార్గాన్ని వీడి సమాజహితానికి పాటుపడాలని సూచించారు.



తడికలపూడి పోలీస్ స్టేషన్లలో రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్ఐ

అంతరపంటలే ఆదాయం

పెరుగుతున్న ఆయిల్‌పామ్ విస్తీర్ణం
నూజివీడు ప్రాంతంలో సారవంత భూములు
ఉద్యానశాఖ జిల్లా అధికారి ఎస్.రామ్మోహనరావు

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

జిల్లాలో ఉద్యానశాఖ ఎంతో కీలకం. ఒకప్పుడు చింతలపూడి, జంగారెడ్డిగూడెం, కొయ్యలగూడెం ప్రాంతాలకే పరిమితమైన అటవీ ప్రాంతాలు కొత్త జిల్లాల ఏర్పాటుతో నూజివీడు, కుక్కునూరు, వేలేరుపాడు ప్రాంతాలకు విస్తరించింది. ప్రధానంగా జిల్లాలో మామిడి విస్తీర్ణం భారీగా పెరిగింది. దాంతో ఏలూరు జిల్లా ప్రపంచపటంలో ప్రత్యేక స్థానం సంపాదించింది. అయితే కొత్తజిల్లాల ఏర్పాటుతో అనేక మార్పులు, చేర్పులు చోటు చేసుకున్నాయి. ఈ నేపథ్యంలో ఉద్యానశాఖపరంగా జరిగిన మార్పులను ఆ శాఖ జిల్లా అధికారి (డిప్యూటీ డైరెక్టర్) ఎస్.రామ్మోహనరావు 'ప్రజాశక్తి' ముఖాముఖీలో వివరించారు.

ప్రశ్న : జిల్లాలో ఎంతమేర ఉద్యాన పంటలు విస్తరించి ఉన్నాయి?

జిల్లాలో 1.8 లక్షల హెక్టార్లలో ఉద్యానపంటలు విస్తరించి ఉన్నాయి. వీటిల్లో కొబ్బరి 14 వేల హెక్టార్లు, మామిడి 14 వేల హెక్టార్లు, కోకో 15 వేల హెక్టార్లు, జీడీ మామిడి ఏడు వేల హెక్టార్లు, నిమ్మ 6500 హెక్టార్లు, కాయగూరలు 1500 హెక్టార్లలో విస్తరించి ఉన్నాయి.

ప్రశ్న : కొత్త జిల్లాల ఏర్పాటుతో ఉద్యానపంటలు పెరిగినట్లా ? తగ్గినట్లా?

కొత్త జిల్లాలు ఏర్పడినప్పటికీ ఉద్యానపంటలు ఎప్పటిలాగానే ఉన్నాయి. నూజివీడు మండలంలో మామిడి, ఆయిల్‌పామ్ పంటలు అధికంగా ఉన్నాయి. కైకలూరు మండలం పూర్తిగా వరిసాగు నియోజకవర్గమైనప్పటికీ ఉద్యాన పంటల విస్తీర్ణం ఏ మాత్రమూ తగ్గలేదు.

ప్రశ్న : జిల్లాలో ఏయే పంటల సాగు లాభదాయకంగా ఉంది?

ఆయిల్‌పామ్ టన్ను ధర 2022 మేలో రూ.23,340గా ఉంది. 2023 మేలో అదికాస్తా రూ.12,844కు పడిపోయింది. గతంలో వేసిన పంట కాలం పూర్తయింది. ఇప్పుడు వేసేవి వచ్చే 25 ఏళ్ల వరకూ ఉంటుంది. అయితే ఇప్పుడున్న పరిస్థితుల్లో అంతరపంటల సాగే లాభదాయకం. కొబ్బరి, ఆయిల్‌పామ్‌లో అంతరపంటగా కోకో వేసుకుంటే ఒకదానిలో లాభం లేకున్నా.. మరో దానిలో లాభం ఉంటుంది. కూలీ, ఇతరాలకు ఒక పంట పోయినా, మరో పంట ఆదాయంగా ఉంటుంది.

ప్రశ్న : సంప్రదాయ సాగు చేస్తున్న రైతులకు మీరిచ్చే సలహా ఏమిటీ?

ఏ పంట అయినా ఆధునిక సాంకేతికతను వినియోగించడం ఉత్తమం. సమగ్ర ఎరువుల విధానం, ఇంటిగ్రేటెడ్ సాగు పద్ధతులను రైతులు వినియోగించాలని సూచిస్తున్నాం.

ప్రశ్న : జిల్లా భూగర్భ జలాలు అందుబాటు ఎలా ఉంది?

జిల్లాలో నూజివీడు ప్రాంతంలో భూసారం బాగుంది. నీరు కూడా అందుబాటులో ఉంది. టి.నరసాపురం, చింతలపూడి, ద్వారకాతిరుమల, జంగారెడ్డిగూడెం, జీలుగుమిల్లి ప్రాంతాల్లో నీరు బాగుంది. కొన్ని ప్రాంతాల్లో తక్కువగా ఉంది. దీంతో క్యాజురైనా, యుకలిప్టస్ తగ్గింది. పొగాకు కూడా తగ్గింది. ఆయిల్‌పామ్ పెరుగుతోంది. ఈ ఏడాది ఏడువేల హెక్టార్లకు పెంచాలని నిర్ణయించాం. 1500 హెక్టార్లు పెంచాము.

ప్రశ్న : మొక్కలు సరఫరా చేస్తున్నారా?

వేగివాడలో కోకోనట్ డెవలప్‌మెంట్ బోర్డ్ ద్వారా నాణ్యమైన మొక్కలు అందిస్తున్నారు. విజయరాయి, తుక్కులూరు నర్సరీల్లో సబ్సిడీపై మొక్కలు అందిస్తున్నారు.

ప్రశ్న : ప్రభుత్వ సబ్సిడీ ఎంతమేర ఇస్తున్నారు?

ఆయిల్‌పామ్‌పై ప్రభుత్వం నాలుగేళ్ల సబ్సిడీ ఇస్తోంది. హెక్టార్‌కు నాలుగేళ్లకు రూ.29 వేలు చొప్పున సబ్సిడీ ఇస్తున్నారు. అంతరపంటలకు రూ.21 వేలు, కోకో వేసుకుంటే మూడేళ్లకు రూ.20 వేలు చొప్పున సబ్సిడీ ఇస్తారు.

ప్రశ్న : కోల్డ్ స్టోరేజ్‌లకు ఎంతమేర సబ్సిడీ ఇస్తున్నారు?

రైతులు సంఘాలుగా ఏర్పడి దరఖాస్తు చేసుకుంటే కోల్డ్ స్టోరేజ్‌లకు 75 శాతం సబ్సిడీ వస్తుంది. యూనిట్ కాస్ట్ రూ.15 లక్షలు ఉంటే, సబ్సిడీ రూ.11.50 లక్షలు ఇస్తారు. ఇలా పలురకాల సబ్సిడీలను ప్రభుత్వం అందిస్తుంది.

లోకేష్ పాదయాత్రను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

సమావేశమైన టిడిపి ముఖ్యనేతలు

త్వరలో జిల్లాలోని నూజివీడు నియోజకవర్గంలోకి ప్రవేశించనున్న టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ యువగళం పాదయాత్రను విజయవంతం చేయాలని ఏలూరు నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి బడేటి రాధాకృష్ణయ్య(చంటి) కోరారు. స్థానిక అమీనాపేటలోని పార్టీ కార్యాలయంలో టిడిపి జిల్లా అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు అధ్యక్షతన ఆదివారం సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. అనంతరం తెలుగుయువత జిల్లా అధ్యక్షులు రెడ్డి సూర్యచంద్రరావు(చందు) అధ్యక్షతన తెలుగు యువత సమావేశం జరిగింది. తొలుత టిడిపి వ్యవస్థాపకులు నందమూరి తారకరామారావు చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ మాగంటి బాబు, మాజీ మంత్రి పీతల సుజాత, మాజీ ఎంఎల్ఎలు చింతమనేని ప్రభాకర్, గంటా మురళీ, ముద్దరబోయిన వెంకటేశ్వరరావు, టిడిపి రాష్ట్ర కార్యదర్శులు, క్లస్టర్ ఇన్‌ఛార్జులు, డివిజన్ ఇన్‌ఛార్జులు, పలు మండలాల అధ్యక్షులు పాల్గొన్నారు.

నూజివీడు రూరల్ : వచ్చేవారం నూజివీడులో జరిగే లోకేష్ యువగళం పాదయాత్రను విజయవంతం చేయాలని మాజీ ఎంఎల్ఎ, నూజివీడు నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి ముద్దరబోయిన వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. ఆదివారం నూజివీడులోని పార్టీ కార్యాలయంలో ముఖ్యనేతలతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ పార్టీ అనుబంధ విభాగాలతో సమన్వయం చేసుకుని పాదయాత్రలో ప్రజలను భాగస్వామ్యం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి పత్తిపాటి పుల్లారావు పాల్గొన్నారు.

ముసునూరు : టిడిపి రాష్ట్ర నాయకులు నారా లోకేష్ యువగళం పాదయాత్రను విజయవంతం చేయాలని నూజివీడు నియోజకవర్గ పార్టీ ఇన్‌ఛార్జి ముద్దరబోయిన వెంకటేశ్వరరావు అన్నారు. ఆదివారం మండలంలోని కాట్రేనిపాడులో టిడిపి నాయకుల, కార్యకర్తల ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈనెల 24, 25 తేదీల్లో నూజివీడు నియోజకవర్గంలో లోకేష్ పాదయాత్ర సాగుతుందని, యాత్రఖర్చు నిమిత్తం కాట్రేనిపాడు ఉపసర్పంచి తనయుడు, టిడిపినేత రాపర్ల మురళీ మాజీమంత్రి పత్తిపాటి పుల్లారావు ఆధ్వర్యంలో రూ.ఐదు లక్షల చెక్కును ముద్దరబోయినకు అందజేశారు. సర్పంచి గద్దల సుహాసిని మోహన్‌రావు, ఎంపిటిసి సూర్యదేవర నాగమంజుల శ్రీనివాసరావు, టిడిపి నాయకులు రాపర్ల ప్రతాప్, రాపర్ల బాలకృష్ణ, ఇస్సాక్ పాల్గొన్నారు.

ప్రారంభోత్సవానికి చేబ్రోలు జగనన్న కాలనీ సిద్ధం

ప్రజాశక్తి - ఉంగుటూరు

మండలంలోని చేబ్రోలులో 5.93 ఎకరాల విస్తీర్ణంలో జగనన్న లేఅవుట్‌లో ఇళ్ల నిర్మాణాలు పూర్తికావడంతో ఏలూరు జిల్లాకు రోల్‌మోడల్‌గా నిలిచింది. అందుకు కృషి చేసిన హౌసింగ్ డిఇ సోమేశ్వరరావు, ఎఇ సురేష్‌బాబును రాష్ట్ర ప్రభుత్వం ఉత్తమ అధికారులుగా అవార్డులతో సత్కరించింది. అర్హత ఉన్న ప్రతి పేదవాడికీ సొంతింటి కల సాకారం చేసేందుకు ముఖ్యమంత్రి జగన్ ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని రాష్ట్ర గృహనిర్మాణ సంస్థ ఎమ్‌డి డాక్టర్ జి.లక్ష్మీషా కితాబిచ్చారు. చేబ్రోలులో జగనన్న ఇళ్ల సముదాలను ఆయన ఇటీవల సందర్శించారు.

మౌలిక సదుపాయాలకు పెద్దపీట

ఈ కాలనీలో తాగునీటి కోసం బోరు ఏర్పాటు చేశారు. ప్రతీవీధికి విద్యుత్ సౌకర్యం, వీధి దీపాలను యుద్ధప్రాతిపదికన బిగించారు. మురుగునీటి వ్యవస్థ కోసం ప్రతితీఇంటికి రూ.ఆరు వేలతో నిర్మిస్తున్న ఇంకుడుగుంత నిర్మాణాలు చేపట్టారు. 5.93 ఎకరాల అసైన్డ్ భూమిని ఎకరం రూ.30 లక్షలతో ప్రభుత్వం కొనుగోలు చేసి 259 ప్లాట్లను సిద్ధం చేసి లబ్ధిదారులకు కేటాయించారు. వారిలో తక్షణం ఇల్లు కట్టుకోవడానికి 181 మంది ముందుకు వచ్చారు. అందరూ ఇళ్ల నిర్మాణాలను పూర్తిచేశారు. దీనికి కృషి చేసిన అధికారులను ప్రజాప్రతినిధులు అభినందించారు. ప్రతీ వీధికి విద్యుత్, పంచాయతీ కుళాయి సౌకర్యాల కల్పనపై సంతృప్తి వ్యక్తం చేశారు.

జిల్లాలోనే ప్రత్యేకతను చాటిన చేబ్రోలు లే అవుట్

ఈగ్రామంలో పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు ఎంఎల్ఎ వాసుబాబు, స్థానిక అధికార పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు ఎన్నో ఒత్తిళ్లను ఎదుర్కొన్నారు. తొలుత సేకరించిన భూమి కోర్టు వివాదంలో ఉండటంతో చేబ్రోలు - తిమ్మయ్యపాలెం దారిలో స్థానిక అట్టల ఫ్యాక్టరీ సమీపంలో అసైన్డ్ భూములను సేకరించేందుకు స్థానిక నాయకులు విశేషంగా కృషి చేశారు. భూసేకరణ చేసిన వెంటనే ఆగమేఘాల మీద సైట్ లెవెలింగ్, నీటికోసం బోరు, విద్యుత్ సౌకర్యాలను ఒకదాని తరువాత మరొకటికి నిధుల కొరత లేకుండా ఎంఎల్ఎ వాసుబాబు కృషి చేశారు. దీంతో ఇల్లు కట్టుకునేవారికి నీటి సమస్య లేకపోవడంతో ఎక్కువ మంది లబ్ధిదారులు పనులు ప్రారంభించి పూర్తి చేశారు.

సమిష్టి కృషితో లే అవుట్ పూర్తి : ఎఇ సురేష్‌బాబు

చేబ్రోలు లేఅవుట్‌లో ఇంతవేగంగా నిర్మాణాలు పూర్తికావడం వెనుక అధికారపార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, సచివాలయ ఉద్యోగుల సమిష్టి కృషి మరువలేనిది. ఇంటి ప్రాముఖ్యతను ప్రతీలబ్ధిదారుడికి వివరించి వారిని చైతన్యపరిచి నిర్మాణాలు పూర్తిచేయడంలో సఫలమయ్యాం. సత్వరం బిల్లులు, సామగ్రి అందించడంలో సమస్యలు రాకుండా చూశాము. సుమారు రూ.రెండు కోట్లకుపైగా నిధులతో విద్యుత్, తాగునీటి వసతి, ఆర్చి తదితర సౌకర్యాలను కల్పించి జిల్లాకు గుర్తింపు తీసుకురావడంలో స్థానిక ఎంఎల్ఎ పుప్పాల వాసుబాబు, సొసైటీ ఛైర్మన్ పాపారావుబాబ్జీ, మాజీ సర్పంచి కరణం బుజ్జి, ఎంపిటిసిలు, పంచాయతీ పాలకవర్గం అందించి సహకారానికి అభినందనలు.

పూర్తయిన ఇళ్లు

సొంతింట కల నెరవేరింది

టేకుమూడి ప్రేమసుందరి

చేబ్రోలు, జగనన్న కాలనీ నివాసితురాలు

ఇప్పటి వరకూ సొంతిల్లు లేక చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నాం. ఇంటి స్థలం ఇవ్వడంతో పాటు, ప్రభుత్వం రూ.1.80 లక్షలు రుణం ఇవ్వడంతో ఇంటిని నిర్మించుకుని ఇక్కడే నివాసం ఉంటున్నాం. వీధి దీపాలు, ఇంటింటికీ తాగునీటి కుళాయి బిగించారు. డ్రెయినేజీ, సీసీ రోడ్డు వేస్తే ఎలాంటి సమస్యలూ ఉండవు. అధికార పార్టీ నాయకుల కృషి వల్లే ఇక్కడ ఈ కాలనీ సర్వాంగ సుందరంగా తయారవుతోంది.

రైతు సదస్సుకు జిల్లా ప్రతినిధిగా కె.శ్రీనివాస్

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఈనెల 24వ తేదీన ఢిల్లీలో సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అఖిల భారత రైతు సదస్సుకు ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నుంచి జిల్లా ప్రతినిధిగా ఆసంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ హాజరవుతున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 24న ఢిల్లీలోని టల్కటోర స్టేడియంలో అఖిల భారత రైతు సదస్సు నిర్వహిస్తున్నారని తెలిపారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ఢిల్లీ రైతాంగ ఉద్యమం సందర్భంగా ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మోసగించిందని విమర్శించారు. దేశవ్యాప్తంగా మరో దశ రైతాంగ ఉద్యమం చేపట్టేందుకు ఈసదస్సులో చర్చించి, భవిష్యత్తు కార్యాచరణ రూపొందిస్తారని తెలిపారు.


కోట్లమ్మ సంబరాల్లో పాల్గొన్న ఎంఎల్ఎ వాసుబాబు

నారాయణపురంలో కోట్లమ్మ సంబరాలు

పాల్గొన్న ఎంఎల్ఎ వాసుబాబు

ప్రజాశక్తి - ఉంగుటూరు

నారాయణపురంలో కోట్లమ్మ సంబరాలు ఆదివారం నిర్వహించారు. ఉత్సవ కమిటీ ఆహ్వానంపై ఎంఎల్ఎ పుప్పాల వాసుబాబు అమ్మవారిని సందర్శించారు. ఆయన వెంట కోట్లమ్మ కమిటీ సభ్యులు, వైసిపి నాయకులు మంగారావు, గోలి రామారావు పాల్గొన్నారు. ఉదయం సంబరాల ప్రారంభోత్సవ కార్యక్రమంలో సర్పంచి దిడ్ల అలకనంద, మాజీ ఎంఎల్ఎ గన్ని వీరాంజనేయులు పాల్గొన్నారు. చిన్నారులచే కోలాట నృత్యాలు, విచిత్ర వేషాలతో అమ్మవారిని ఊరేగించారు. శ్రావణమాసం కావడంతో పెద్ద సంఖ్యలో భక్తులు దర్శనం చేసుకున్నారు.

నల్లమాడు పరిధిలో అక్రమంగా తరలిస్తున్న కంకర

కంకర అక్రమ రవాణా

అడ్డుకున్న గ్రామస్తులు

ప్రజాశక్తి - ఉంగుటూరు

పోలవరం కుడికాలువ గట్టు, కంసాలిగుంట, గొల్లగూడెం, నల్లమాడు పరిధిలో ఆదివారం అనుమతులు లేకుండా కంకర తవ్వుతుండగా కంసాలిగుంట గ్రామస్తులు పలువురు అడ్డుకున్నారు. కంకర తోలుతున్న ట్రాక్టరు, జేసిబిలను పట్టుకుని రెవెన్యూ అధికారులకు సమాచారం అందజేశారు.

రేపు మున్సిపల్ డైరెక్టరేట్ ఎదుట ధర్నా

ప్రజాశక్తి - చింతలపూడి

మున్సిపల్ కార్మికుల సమస్యలు చర్చలకే పరిమితం తప్ప, పరిష్కారం కావడం లేదని ఎపి మున్సిపల్ వర్కర్స్ యూనియన్(ఎఐటియుసి అనుబంధం) చింతలపూడి గౌరవాధ్యక్షులు, ఎఐటియుసి జిల్లా కోకన్వీనర్ తొర్లపాటిబాబు తెలిపారు. సమస్యల పరిష్కారం కోసం ఆగస్టు 22న మున్సిపల్ డైరెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేపడుతున్నట్లు తెలిపారు. మున్సిపల్ వర్కర్స్ యూనియన్ కమిటీ సమావేశం చింతలపూడి సిపిఐ కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా తొర్లపాటిబాబు మాట్లాడుతూ మున్సిపల్ రంగంలో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేస్తామన్న సిఎం జగన్ ఆవైపు ఆలోచించడం లేదన్నారు. చర్చలు కాదు పరిష్కారాలు కావాలంటూ కోరారు. చింతలపూడి నగర పంచాయతీకి సంబంధించి 50 మంది కార్మికులు పనిచేస్తుంటే, 30 మందికే ఆప్కాస్ చేయటానికి అనుమతులు వచ్చాయని, మిగతా 20 మందిని ఎందుకు ఆపారో అర్థం కావడం లేదన్నారు. కావున మరలా ఎంక్వైయిరీ చేసి మిగిలిన 20 మందిని కూడా ఆప్కాసులో చేర్చాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షురాలు వెలగాడ అనురాధ, శ్రీరామ్, వెంకటయ్య, ఒడిత్య బాలు, సంధిపం, చెన్నయ్య పాల్గొన్నారు.

నిరుపేదలకు దుప్పట్ల పంపిణీ

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

మానవత నూజివీడు శాఖ వారి ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలోని ఎంఆర్ అప్పారావు కాలనీలో నిరుపేదలకు దుప్పట్ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. కీర్తిశేషులు, ప్రముఖులు రామ్మోహన్ రావు జ్ఞాపకార్థమై ఆయన సతీమణి నాగమణి సౌజన్యంతో ఈ దుప్పట్ల కార్యక్రమాన్ని నిర్వహించారు.

తెగిపడిన 11 కెవి విద్యుత్ వైరు

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

పట్టణంలోని శ్రీసారథి ఇంజనీరింగ్ కళాశాల సమీపంలోని శ్రీనివాస దాబా వద్ద ఆదివారం ఉదయం 11 కేవీ విద్యుత్ వైరు హఠాత్తుగా తెగిపడింది. దీంతో సమీపంలోని ప్రజలు భయాందోళనకు గురయ్యారు. ఘటనపై సమాచారం అందుకున్న విద్యుత్ శాఖ అధికారులు పరిశీలించి మరమ్మతులు చేపట్టారు.

జేబి గ్రాండ్ హోటల్‌లో అగ్నిప్రమాదం

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

స్థానిక జేబి గ్రాండ్ హోటల్‌లో అగ్నిప్రమాదం సంభవించింది. ఆదివారం సాయంత్రం 7గంటల సమయంలో హోటల్‌లో మంటలు చెలరేగాయి. దీంతో స్థానికులు, పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది అప్రమత్తమై మంటలను అదుపు చేసారు. ఎవరికీ ఎటువంటి ప్రాణహాని జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. స్థానిక ఎస్ఐ సాగర్ బాబు, అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు. ప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

జేబి గ్రాండ్ హోటల్‌లో చెలరేగుతున్న మంటలు

నేరాలు - ఘోరాలు

ద్విచక్ర వాహనం బోల్తా : యువకుడికి గాయాలు

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

ద్విచక్ర వాహనం అదుపు తప్పి, పల్టీ కొట్టిన ఘటనలో యువకుడు గాయాలపాలయ్యాడు. ఈ ఘటన ఆదివారం రౌతుగూడెం సమీపంలోని రహదారిపై చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం యర్రవరం నిర్వాసిత కాలనీకి చెందిన వై.వెంకన్నబాబు(19) ద్విచక్ర వాహనంపై జీలుగుమిల్లి నుంచి బుట్టాయగూడెం వైపుకి వెళ్తుండగా రౌతుగూడెం సమీపంలో ద్విచక్ర వాహనం అదుపు తప్పి పల్టీ కొట్టడంతో అతనికి గాయాలయ్యాయి. స్థానికులు గుర్తించి చికిత్స నిమిత్తం జీలుగుమిల్లి పిహెచ్‌సికి తరలించారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం నిమిత్తం 108 వాహనంలో జంగారెడ్డి గూడెం ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 83339 88814

ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి : సిఐటియు

ప్రజాశక్తి - నిడమర్రు

రాష్ట్రంలో ఉన్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, 72 షెడ్యూలు రంగాలకు సంబంధించిన వేతన సవరణ వెంటనే చేయాలని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.రాజా రామ్మోహన్ రాయ్ డిమాండ్ చేశారు. నిడమర్రులో శనివారం ప్రారంభమైన జిల్లా సిఐటియు ముఖ్య కార్యకర్తల శిక్షణా తరగతులలో రెండో రోజు ఆదివారం ఆయన పాల్గొన్నారు. కె.విజయలక్ష్మి అధ్యక్షతన నిర్వహిస్తున్న తరగతుల్లో రాయ్ మాట్లాడుతూ రాష్ట్ర సిఎం జగన్మోహన్ రెడ్డి చేసిన వాగ్దానాలు నెరవేర్చడంలో విఫలమయ్యారని విమర్శించారు. సిపిఎస్ విధానాన్ని రద్దు చేస్తానని చెప్పి మాట తప్పారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులందరినీ రెగ్యులరైజ్ చేస్తానని చెప్పి, కేవలం పదివేల మందిని మాత్రమే చేస్తున్నారని దుయ్యబెట్టారు. ఆశ, అంగన్‌వాడీ, మిడ్ డే మీల్స్, స్కీమ్ వర్కర్లకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, గ్రాట్యూటీ, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ అందించాలని డిమాండ్ చేశారు. అసంఘటిత రంగంలో బిల్డింగ్ వర్కర్లకు ఉన్న వెల్ఫేర్ బోర్డుని పునరుద్ధరించాలని, రవాణా రంగ కార్మికులకు వెల్ఫేర్ బోర్డును ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. పారిశుధ్య కార్మికులతో వెట్టి చాకిరి చేయించుకుంటున్న వారిని, కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ పేరిట ఉన్న కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విద్యుత్ సంస్థల్లో పని చేస్తున్న కాంట్రాక్ట్ వర్కర్లకు డైరెక్టర్ పేమెంట్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో పెరుగుతున్న వలస కార్మికులకు రక్షణ కల్పించాలని, వలస కార్మికుల చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని ఆయన కోరారు. జగన్మోహన్ రెడ్డి తన సొంత ప్రయోజనాల కోసం రాష్ట్రానికి రావలసిన రైల్వే జోన్, కడప స్టీల్ ఫ్యాక్టరీ, ప్రత్యేక హోదా వంటి రాష్ట్ర ప్రయోజనాలను కేంద్ర ప్రభుత్వానికి తాకట్టు పెట్టారని విమర్శించారు. కార్మికవర్గం ఎన్నో పోరాటాలతో సాధించుకున్న చట్టాలను కేంద్ర ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్స్‌గా మార్చి కార్మిక వర్గాన్ని పెట్టుబడిదారులకు బానిసలుగా మార్చుతోందని, దీనిని కార్మిక, ఉద్యోగ, శ్రామిక వర్గం అంతా కలిసికట్టుగా తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. ఈ శిక్షణా తరగతుల్లో సిఐటియు జిల్లా నాయకులు నారపల్లి రమణారావు, ఎస్‌కె.సుభాషిని, వై.సాయికిరణ్, ప్రసాదు, హరికుమారి, శ్రీను, జి.సత్యనారాయణ, జె.గోపి, మాణిక్యం పాల్గొన్నారు.

శిక్షణా తరగతుల్లో మాట్లాడుతున్న రాయ్

పేద విద్యార్థికి ప్రోత్సాహం

ప్రజాశక్తి - ముసునూరు

సేవా దృక్పదంతో పేద విద్యార్థికి రూ.20వేలు నగదు చెక్కును దేవినేని వరప్రసాద్ ఆదివారం అందజేశారు. మండలంలోని ముసునూరు గ్రామానికి చెందిన చిట్టూరి సాంబశివరావు కుమారుడు చిట్టూరి యశ్వంత్ మైలవరంలోని లక్కిరెడ్డి బాలరెడ్డి ఇంజనీరింగ్ కాలేజీలో బిటెక్ రెండో సంవత్సరం చదువుతున్నాడు. ఇతను కుటుంబ ఆర్థిక పరిస్థితులతో ఇబ్బంది పడడంతో, అవసరాలను దృష్టిలో పెట్టుకుని రూ.20వేలు నగదు చెక్కును అందజేశారు. దేవినేని విజయనారాయణ హైదరాబాద్‌లో నివాసం వుండటంతో ముసునూరు గ్రామ వాస్తవ్యులు దేవినేని వరప్రసాదరావు ఆధ్వర్యంలో అందజేశారు. యశ్వంత్ కుటుంబసభ్యులు వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.


విద్యార్థికి చెక్కును అందిస్తున్న వరప్రసాద్

మానవత సేవా కార్యక్రమాలు విస్తరించాలి

ప్రజాశక్తి - భీమడోలు

స్వచ్ఛంద సేవా సంస్థ మానవత భీమడోలు శాఖ అందిస్తున్న సేవా కార్యక్రమాలను మరింతగా విస్తరించేందుకు సహకరించాలని శాఖ అధ్యక్షులు వట్టి సుగుణాకర్ కోరారు. మానవత సంస్థ ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకొని మండల పరిధిలో నిర్వహిస్తున్న వారోత్సవాల్లో భాగంగా ఆదివారం బైపాస్ రోడ్డులోని విభాజకాల్లో పర్యావరణ పరిరక్షణ నిమిత్తం మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ మేరకు అవసరమైన మొక్కలను గ్రామపంచాయతీతో పాటు స్వచ్ఛంద సంస్థ చైతన్య యువజన సంఘం అధ్యక్షులు డాక్టర్ పి.మాన్సింగ్ సమకూర్చారు. మొక్కల పరిరక్షణకు తగు చర్యలు తీసుకుంటామని శాఖ అధ్యక్షులు తెలిపారు. అనంతరం సంస్థ ఆధ్వర్యంలో కరోనా సమయంలో గ్రామ పరిధిలో ఆరోగ్య పరిరక్షణకు సేవలు అందించిన పంచాయతీకి చెందిన నలుగురు పారిశుధ్య కార్మికులకు దుస్తులను అందజేశారు. కురెళ్ళగూడెం గ్రామంలో నిర్వహించిన సంస్థ నెలవారీ సమావేశంలో భాగంగా సంస్థ ఆధ్వర్యంలో గతనెలలో చేపట్టిన సంక్షేమ, సేవా కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. ప్రస్తుత నెల చేపట్టవలసిన సేవా, సంక్షేమ కార్యక్రమాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో మానవత సంస్థ జిల్లా కార్యవర్గ సభ్యులు రామిశెట్టి గంగాధర రావు, అప్పక రాంబాబు, సభ్యులు పచ్చా వెంకటేశ్వరరావు, టివి ఉమామహేశ్వరరావు, పంచకర్ల సత్యనారాయణ, చిలపర్తి రామానాయుడు, జడ్‌పిటిసి సభ్యులు తుమ్మగుంట భవానీరంగ, డాక్టర్ పి.మాన్సింగ్ పాల్గొన్నారు.

మొక్కలు నాటుతున్న మానవత సభ్యులు, ప్రజా ప్రతినిధులు

ఎత్తిపోతల పథకాన్ని త్వరగా పూర్తిచేయాలి : జనసేన

ప్రజాశక్తి - చాట్రాయి

చింతలపూడిలో ఎత్తిపోతల పథకాన్ని త్వరితగతిన పూర్తిచేసి రైతన్నలకు మేలు చేయాలని నూజివీడు నియోజకవర్గ జనసేన నేత బర్మా ఫణి బాబు డిమాండ్ చేశారు. ఎత్తిపోతల పథక పనులను ఆదివారం పరిశీలించి ఆయన మాట్లాడుతూ టిడిపి ప్రభుత్వంలో 75శాతం పథకం పనులు పూర్తయ్యాయన్నారు. వైసిపి పాలనలో కనీసం పారమట్టి కూడా తీయలేదని విమర్శించారు. రైతు రాజ్యం అని ప్రచారం చేసుకోవడమే తప్ప, రైతుల కోసం జగన్ ప్రభుత్వం చేసిందేమి లేదన్నారు. సాధారణ ఎన్నికలు 2024లో జనసేన అధికారంలోకి రావడం ఖాయమని, ప్రజా నాయకుడు పవన్ కళ్యాణ్ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి కాగానే రైతుల క్షేమాన్ని కాంక్షిస్తూ, మిగిలిపోయిన ప్రాజెక్టులన్ని పూర్తి చేస్తారని హామీ ఇచ్చారు. ఇప్పటికైనా జగన్ కళ్ళు తెరిచి పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేయడం ద్వారా రైతు రాజ్యంగా నిరూపించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు పాశం నాగబాబు, తుమ్మల జగన్, మొలుగుమాటి భాస్కర్, అబ్బుదాసరి సురేష్, పరస గోపి, రైతులు పాల్గొన్నారు.

పాతూరులో పర్యటిస్తున్న ఉంగుటూరు ఇంఛార్జి ధర్మరాజు

అభివృద్ధికి దూరంగా పల్లెలు : జనసేన

ప్రజాశక్తి - భీమడోలు

వైసిపి హయాంలో పల్లెలు అభివృద్ధికి దూరంగా ఉన్నాయని జనసేన ఉంగుటూరు నియోజకవర్గ ఇంఛార్జి పత్సమట్ల ధర్మరాజు ఆరోపించారు. పార్టీ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న 'జనంలోనికి జనసేన' కార్యక్రమంలో భాగంగా ఆయన పాతూరు గ్రామంలో ఆదివారం సాయంత్రం పర్యటించారు. ఇంటింటికీ వెళ్లారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మురుగునీటి పారుదల వ్యవస్థ సక్రమంగా లేని కారణంగా ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల శాఖ అధ్యక్షులు పత్తి మదన్, నాయకులు టి.రామ్మూర్తి, సిహెచ్ పార్వతి, ఉంగుటూరు నియోజకవర్గ ఐటీ విభాగం సమన్వయకర్త అయితం ప్రసాద్ పాల్గొన్నారు.

ఘనంగా రాజీవ్ గాంధీ జయంతి


జంగారెడ్డిగూడెంలో నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నేతలు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

భారత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ జయంతిని స్థానిక కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగ నిర్వహించారు. ఆదివారం స్థానిక పేరంపేట రోడ్డు మీసేవ కేంద్రం వద్ద రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. పట్టణ అధ్యక్షులు ప్రగడపాటి కాశి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో పిసిసి అధికార ప్రతినిధి మద్దాల ప్రసాద్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కీర్తిశేషులు, మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ దేశానికి సాంకేతికతను అందించారని తెలిపారు. మాజీ జెడ్‌పిటిసి సభ్యులు ముప్పిడి శ్రీనివాసరావు మాట్లాడుతూ రాజీవ్ గాంధీ దేశ ప్రధానిగా కమ్యూనికేషన్ రంగాన్ని అభివృద్ధి చేసి, దేశాన్ని సాంకేతిక రంగంగా ప్రపంచ చిత్రపటంలో అత్యంత ఉన్నత శిఖరానికి తీసుకెళ్లారన్నరు. ప్రజాస్వామ్య పరిరక్షణే ధ్యేయంగా దేశాన్ని పరిపాలించి, భారతదేశాన్ని శాంతి భద్రతలతో ముందుకు నడిపించారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షులు హేరా హకీం, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు తాడేపల్లి ఉమా, పట్టణ కార్యదర్శి వీరవల్లి సోమేశ్వరరావు, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు మొగిలినీడిశ్యాం పాల్గొన్నారు.

భీమడోలు : దేశ ఆరవ ప్రధాని రాజీవ్ గాంధీ 79వ జయంతి కార్యక్రమాన్ని సద్భావనదినం పేర భీమడోలులో ఆదివారం నిర్వహించారు. దీనిలో భాగంగా భీమడోలులోని సంతపేటలో కాంగ్రెస్ అధ్యక్షులు యర్రంశెట్టి ఏడుకొండలు ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి సత్కరించి, కేక్ కట్ చేశారు. మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏడుకొండలు మాట్లాడుతూ సామాజిక శాంతి, మతసామరస్యం పెంపొందించేందుకు సద్భావనదినం పేర పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. దేశ అభ్యున్నతికి కృషి చేసిన రాజీవ్ గాంధీ సేవలు గుర్తుచేసుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సామాజిక కార్యకర్త మండే సుధాకర్, విశ్రాంత ఉపాధ్యాయులు వసంతరావు, ఇంజేటి అచ్యుతం పాల్గొన్నారు.


భీమడోలులో రాజీవ్‌గాంధీ జయంతిలో ప్రముఖులు

కైకరంలో ప్రజాసంఘాల కార్యాలయం ప్రారంభం

కైకరంలో ప్రజాసంఘాల కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న నరశింహరావు

ప్రజాశక్తి - ఉంగుటూరు

కైకరం పంచాయతీ కార్యాలయం సమీపంలో నూతనంగా నిర్మించిన ప్రజాసంఘాల (బిల్డింగ్ వర్కర్స్ యూనియన్(సిఐటియు), రైతు, గ్రంథాలయం) భవనాన్ని ఆదివారం ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం కార్యదర్శి జి.నర్సింహరావు ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించారు. అనంతరం జిల్లా సీనియర్ నాయకులు గుత్తికొండ వెంకట కృష్ణారావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులు, గ్రామస్థులకు అభ్యుదయ విజ్ఞానాన్ని అందించేందుకు ఈభవనం ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎపి రైతు సంఘం నాయకుడు చింతకాయల బాబూరావు, సిఐటియు నాయకులు వెంకటరావు పాల్గొన్నారు.

దట్టంగా ముళ్ల చెట్లు..

ప్రయాణికుల అవస్థలు

ముదినేపల్లి : ప్రధాన రహదారి మలుపులో ఉన్న ముళ్లచెట్లు ప్రమాదాలకు నిలయంగా మారాయి. ముదినేపల్లి - బంటుమిల్లి రోడ్డులోని ఉప్పరగూడెం మలుపులో పెదలంక వంతెన వద్ద దట్టంగా ముళ్లచెట్లు పెరిగాయి. ఈ చెట్ల కారణంగా ఎదురుగా వచ్చే వాహనాలు కనబడటంలేదు. ఎదురుగా వచ్చే వాహనం దగ్గరకు వచ్చే వరకూ కనబడకపోవడంతో తరచూ ఇక్కడ వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. నిత్యం ఈ రోడ్డులో వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఈ ముళ్లచెట్లను తొలగించి ప్రమాదాలను నివారించాలని వాహనదారులు సంబంధిత అధికారులను కోరుతున్నారు.

రహదారికి ఇరువైపులా పేరుకుపోయిన ముళ్లచెట్లు

అర్హులందరికీ జగనన్న ఇళ్లు

చేబ్రోలులో జగనన్న లేఅవుట్లను పరిశీలించిన ఎమ్‌డీ లక్ష్మీషా

నెలాఖరుకు రాష్ట్రంలో జగనన్న ఇళ్ల కాలనీల ప్రారంభానికి చర్యలు

అంతర్గత రహదారుల కోసం రూ.10.23 కోట్లు కేటాయింపు

ప్రజాశక్తి - ఉంగుటూరు

అర్హత ఉన్న ప్రతీ పేదవాడికీ సొంతిళ్లు కల సాకారం చేసేందుకు సిఎం జగన్ ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని ఆంధ్రప్రదేశ్ హౌసింగ్ కార్పొరేషన్ లిమిటెడ్(ఎపిఎస్‌హెచ్‌సిఎల్) ఎమ్‌డీ డాక్టర్ జి.లక్ష్మీషా తెలిపారు. ఉంగుటూరు మండలం చేబ్రోలులో జగనన్న ఇళ్ల సముదాలను ఆయన సందర్శించారు. వీధి వీధికి తిరుగుతూ నిర్మాణాల తీరును చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. పలు గృహాలను సందర్శించి, ఇంటి యాజమానులతో మాట్లాడి, వారి మనోభావాలను తెలుసుకున్నారు. ప్రతీ ఇంటికీ ఇంకుడిగుంట(సోపిట్ వెల్) నిర్మాణాలపై పలు సూచనలిచ్చారు. 5.93 ఎకరాలను ప్రభుత్వం సేకరించి, 259 ప్లాటులను సిద్ధం చేసి, అందులో అర్హత కలిగిన 181 మంది లబ్ధిదారులకు పట్టాలిచ్చారు. వాటిలో 81 ఇళ్లు పూర్తైన వారంతా, నివాసాలు అక్కడే ఉండటానికి కృషి చేసిన ప్రజాప్రతినిధులు, అధికారులను ఎండీ అభినందించారు. అనంతరం విలేకర్లతో ఎండీ లక్ష్మీషా మాట్లాడుతూ ఈనెల 30వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా జగనన్న ఇళ్లను భారీ సంఖ్యలో ప్రారంభించేందుకు ముఖ్యమంత్రి నిర్ణయం తీసుకున్నారన్నారు. అందులో భాగంగా తనను ఏలూరు, పశ్చిమ, కృష్ణా, ఎన్‌టిఆర్ జిల్లాలకు ప్రత్యేక దృష్టి పెట్టాల్సిందిగా సిఎం ఆదేశించారని తెలిపారు. సిఎం సామర్లకోటలో ఇళ్ల కాలనీలను ప్రారంభిస్తారని, అదే రోజు ప్రతీ జిల్లాకు ఒక కాలనీని గుర్తించి అధికారులంతా ప్రారంభోత్సవాల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. ఏలూరు జిల్లాలో చేబ్రోలు కాలనీకి ఈమేరకు అన్ని సదుపాయాలతో నిర్మాణాలు పూర్తికావడం అభినందనీయమన్నారు. ఈకాలనీకి 2,280 మీటర్ల మేర ప్రధాన రోడ్డు, అంతర్గత రహదారుల కోసం రూ. 48 లక్షలు నిధులు విడుదల చేశామని, వారం రోజుల్లో పనులు పూర్తి చేయాల్సిందిగా అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. రాష్ట్రంలో 20 లక్షలకు పైగా జగనన్న ఇళ్లనిర్మించాలనే లక్ష్యంలో భాగంగా ఈనెలాఖరుకు ఐదు లక్షలు, డిసెంబరు నెలాఖరుకు మరో ఐదు లక్షలు పూర్తిచేసేలా అధికారులంతా కృషి చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో 4,600 లేఅవుట్లను రూ.7 వేల కోట్లతో సిద్ధం చేశామని ఎండీ పేర్కొన్నారు. ఆయన వెంట హౌసింగ్ జిల్లా పిడి విజయరాజు, ఎస్ఇ కూర్మినాయుడు, డిఎల్‌డిఒ రమణ, ఇఇ రమాకాంత్, డిఇ సోమేశ్వరరావు, ఎఇ సురేష్‌బాబు, ఎంపిటిసి సభ్యులు రాయి లక్ష్మి, మనసాల నాగమణి, సొసైటీ ఛైర్మన్ పాపారావు బాబ్జి, జహంగీర్, సచివాలయం ఉద్యోగులు పాల్గొన్నారు.

జగనన్న లేఅవుట్ వివరాలను పరిశీలిస్తున్న ఎమ్‌డి లక్ష్మీషా

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

భార్య కాపురానికి రావడంలేదని తీవ్ర మనస్తాపానికి గురైన భర్త మద్యానికి బానిసై కూల్‌డ్రింక్‌లో పురుగులమందు కలుపుకుని తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఏలూరు రూరల్ మండలం లింగారావుగూడేనికి చెందిన పల్లి శివ(22)కు వివాహమైంది. చెడు వ్యసనాలకు బానిస అవ్వడంతో అతని భార్య పుట్టింటికి వెళ్లిపోయింది. అప్పటి నుంచి ఆమె కాపురానికి రావడం లేదని మనస్థాపానికి గురై, మరింత మద్యానికి బానిసైపోయాడు. తీవ్ర మనస్థాపానికి గురైన ఇతను ఈనెల 19వ తేదీన కూల్‌డ్రింక్‌లో పురుగులమందు కలుపుకుని తాగాడు. అతనిని ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ 19వ తేదీ అర్ధరాత్రి దాటిన తరువాత మృతి చెందాడు. ఈ సంఘటనపై ఏలూరు రూరల్ ఎస్.లక్ష్మణబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రకటన

మహారాజశ్రీ తణుకు 1వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
ఇ.పి.నెం. 55/2022
ఓ.ఎస్.నెం. 60/2009

బిట్వీన్:
డి. హెచ్. ఆర్ /వాది: విప్పర్తి ప్రభాకరరావు
అండ్
జె. డి. ఆర్ /ప్రతివాది:
పీతల చిన నరసింహామూర్తి వగైరాలు
2వ జె. డి. ఆర్: సోదగిరి భీముడు, తండ్రి: పుల్లయ్య, 63 సంుుు, హిందు, పురుషుడు, సాుు మార్టేరు, పెనుమంట్ర మండలం, తణుకు జె.సి.జె.

పై నెంబరు వారంటు గ్రంధమునందు తమకోర్టు అమీనా గారి ద్వారా ప్లయింటు షెడ్యూలు దాఖలా ఆస్థియందు Eneroachments తొలగించి 1, 2 జె.డి.ఆర్స్ ప్లయింటు షెడ్యూలు తప్పించి వాది /డి.హెచ్.ఆర్.కు Vacent Possession ఇప్పించమని దాఖలు చేసిన వారంటు గ్రంధమునందు కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం 2వ జె.డి.ఆర్. అయిన మీకు ఎన్నిసార్లు నోటీసులు పంపిననూ అమలు జరగని కారణముగా పేపరు ప్రకటన ద్వారా అమలు జరుగు నిమిత్తం ది. **12-09-2023 సంుురం తేదీనకు వాయిదా వేసియున్నారు. ఆరోజు ఉదయం గంుు 10:30 నిుులకు పై కోర్టు వారి ఎదుట హాజరై మీ ఆక్షేపణలు తెలియపర్చుకోవలెను.** లేనిఎడల మీ పరోక్షమందు తీర్మానించబడునని తెలియజేయడమైనది.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

శ్యామ్‌సన్ మెరిపో
తణుకు, అడ్వకేట్, తణుకు.
16-8-23. సెల్: 99499 90988

IN THE COURT OF THE SENIOR CIVIL JUDGE :: TADEPALLIGUDEM
F.D.I.A.No.6/2023
in O.S.No.398/2014

Between:
Posimsetti Ram Murthy
...Petitioner /Plaintiff
Vs
Vanapalli Tirupathi Rayudu
...Respondent /Defendant

In the above matter the Honourable court order on 03-08-2023 to publish in the new paper for sale of the below schedule property for recover of the mortgage debt in the premises of the Honourable court to be held on 05-09-2023. So, please take notice that the Honourable court conduct auction for sale of below schedule property on 05-09-2023 at 10:30 AM in the premises of the Honourable Senior Civil Judge Court, Tadepalligudem, if any one willing to participate in the auction please attend before the **Honourable Court at 10:30 A.M on 05-09-2023** and know the terms and conditions of the auction and participate in the auction.

SCHEDULE

West Godavari District, Bhimavaram Sub-Registrar, Attilli Sub-Division, Ganapavaram Mandalam, S.Kondepadu village, Wet land, R.S.No.133/4 full extent of Ac.1-82cents in which as per sub division present R.S.No.133/4A an extent of Ac.0-89 cents and in R.S.No.133/4B full extent of Ac.0-02cents and R.S.No.135/3 full extent Ac.1-76 cents in which as per sub division present R.S.No.135/3B full extent of Ac.0-25 cents the land in all the Three R.S.No's consisting in to single plot in a total extent of Ac.1-16 cents in which the Northern extent of Ac.0-58 cents of land is bounded by:

East: Gedela Kodugattu. ***South:*** Land of Vanapalli Tirupathi Rayudu i.e., the defendant. ***West:*** Land of Yalamanchali Chinnayya. ***North:*** Land of Vanapalli Peda Satyam.

With in the above boundaries an extent of Ac.0-58 cents of land with all easementery right there in.

Value of the Petitioner: Rs.4,00,000/-
Amin Value:

K.MANI KUMAR
Advocate for Petitioner
Tadepalligudem, Tadepalligudem
20-8-23. Phone: 08818-244620

IN THE COURT OF THE SENIOR CIVIL JUDGE :: TADEPALLIGUDEM
F.D.I.A.No.5/2023
in O.S.No.399/2014

Between:
Posimsetti Krishna
...Petitioner /Plaintiff
Vs
Vanapalli Tirupathi Rayudu
...Respondent /Defendant

In the above matter the Honourable court order on 03-08-2023 to publish in the new paper for sale of the below schedule property for recover of the mortgage debt in the premises of the Honourable court to be held on 05-09-2023. So, please take notice that the Honourable court conduct auction for sale of below schedule property on 05-09-2023 at 10:30 AM in the premises of the Honourable Senior Civil Judge Court, Tadepalligudem, if any one willing to participate in the auction please attend before the **Honourable Court at 10:30 A.M on 05-09-2023** and know the terms and conditions of the auction and participate in the auction.

SCHEDULE

West Godavari District, Bhimavaram District Registrar, Attilli Sub-registry, Ganapavaram Mandalam, S.Kondepadu village, Dry land, R.S.No.133/4 full extent of Ac.1-82cents in which as per sub division present R.S.No.133/4A an extent of Ac.0-89 cents and in R.S.No.133/4B full extent of Ac.0-02cents and R.S.No.135/3 full extent Ac.1-76 cents in which as per sub division present R.S.No.135/3B full extent Ac.0-46 cents in which Ac.0-25 cents the land in all the Three R.S.No's consisting in to single plot in a total extent of Ac.1-16 cents in which the Southern extent of Ac.0-58 cents of land is bounded by:

East: Gedela Kodugattu. ***South:*** Land of Vanapalli Venkata Subba Rao. ***West:*** Land of Yalamanchali Chinnayya. ***North:*** Land of Vanapalli Tirupathi Rayudu i.e., the defendant.

With in the above boundaries an extent of Ac.0-58 cents of land with all easementery right there in.

Value of the Petitioner: Rs.4,00,000/-
Amin Value:

K.MANI KUMAR
Advocate for Petitioner
Tadepalligudem, Tadepalligudem
20-8-23. Phone: 08818-244620